యాప్‌తో హ్యాపీ



- ఊరికెళ్లే వారి ఇళ్లకు భద్రత కల్పించే ప్రత్యేక పోలీస్ యాప్
- ఎల్‌ఎంహెచ్‌ఎస్‌తో చోరీలకు చెక్
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అల్లిపురం: దసరా పండగ వస్తుందంటే చాలు ప్రతి ఇంట సందడి మొదలవుతుంది. సొంత గ్రామాలకు వెళ్లాలని, కొత్తబట్టలు కొనాలని ఉత్సాహం చూపిస్తుంటారు. ఇదే అదనుగా తీసుకుని దొంగలు చేతివాటం చూపిస్తుంటారు. ఊరికి వెళ్లే తొందరలో చుట్టుపక్కల వారికి కూడా ఇంటిపై కాస్త నిఘా ఉంచాలని చెప్పకుండా వెళ్లిపోతుంటారు. పోలీసులకు కూడా సమాచారం ఇవ్వరు. ఈ నేపథ్యంలో పోలీసులు నేరాల నియంత్రణ పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఇల్లు వదిలి వెళ్లే సమయంలో..

- ఇంటి చిరునామా, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియపరచాలి. ఎప్పుడు ఊరు వెళ్తున్నదీ.. ఎప్పుడు తిరిగి వస్తున్నదీ తెలియజేయాలి. ఇంటి యజమాని ఫోన్ నంబరు అందజేయాలి. లేదా వాచ్‌మెన్‌ను నియమించాలి.
- అపార్టుమెంట్‌లో ఉన్న వారు వాచ్‌మెన్ ఫొటో, అడ్రస్ తీసుకోవాలి. కొత్తవారు వచ్చేటప్పుడు వాచ్‌మెన్‌తో వారిని ప్రశ్నింపజేయాలి. రిజిస్టర్‌లో వారి పేరు అడ్రస్, ఫోన్ నంబరు, ఎక్కడికి వెళ్తున్నదీ నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలి.
- అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోను, ప్రవేశ ద్వారం, కారిడార్‌లోను సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లలో ఎక్కువ మొత్తంలో సొమ్ము, బంగారం, వెండి ఆభరణాలు ఉంచరాదు. బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి.
- ప్రయాణాల్లో విలువైన వస్తువులు బ్యాగుల్లో పెట్టకండి. జాగ్రత్తగా భద్రపరుచుకోండి. చిన్న పిల్లలను, బ్యాగులను ఎక్కడ పడితే అక్కడ వదిలిపెట్టి వెళ్లకండి.

షాపింగ్ చేసేవారు..

దసరా వేళ షాపింగ్ సందడిలో డబ్బు పెట్టుకున్న బ్యాగులు మరిచిపోతుంటారు. బ్యాగులు పట్టుకోవడంలో అశ్రద్ధ వహిస్తుంటారు. దీనిని దొంగలు అవకాశంగా తీసుకుని దొంగతనాలకు పాల్పడుతుంటారు. షాపింగ్ సమయంలో జాగ్రత్తగా ఉండాలి.

- షాపింగ్ చేసేవారు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. డబ్బులతో కూడిన బ్యాగులు ఉన్నప్పుడు జాగ్రత్తగా పట్టుకోవాలి. రద్దీగా ఉన్న చోట జేబు దొంగలు, బంగారు వస్తువులు దొంగిలించేవారు ఉంటారు. చుట్టుపక్కల వారిని గమనిస్తుండాలి.
- దుస్తులు కొనే హడావుడిలో పర్సులు, బ్యాగులు పక్కన పెట్టరాదు. జనాల్లో దొంగలు తమ చేతి వాటం చూపిస్తుంటారు. అందరూ కస్టమర్లలాగానే కనబడతారు. దొంగతనం జరిగిన తర్వాత కంటే, ముందే జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.
- రూ.10, రూ.50, రూ.100 నోట్లు కింద పడేసి, మీ దృష్టిని మరల్చి విలువైన వస్తువులు, తెచ్చుకున్న డబ్బు కాజేసే అవకాశం ఉంటుంది. ముందుగానే జాగ్రత్త పడితే మంచిది.
- డిజిటల్ లావాదేవీలకే ప్రాధాన్యత ఇవ్వండి. వీలైనంత వరకు నగదు రహిత లావాదేవీలకు మొగ్గు చూపండి. డబ్బు ఉన్నప్పుడు జాగ్రత్త వహించండి.

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో నిశ్చింత..

ఇల్లు విడిచి అడుగు పెట్టాలంటే ఇక భయపడాల్సిన అవసరం లేదు. సాంకేతిక సాయంతో చోరీలకు చెక్ చెప్పే ఆధునిక వ్యవస్థను నగర పోలీసులు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. పోలీసు శాఖ రూపొందించిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌ను ప్రజలు తమ మొబైళ్లలో డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ అవ్వాలి. ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా వెళ్లే ముందు ఈ యాప్ సహాయంతో పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో పోలీసులు మీ ఇంటి దగ్గర టెక్నాలజీ సహాయంతో భద్రత కల్పిస్తారు. ముందుగా గూగుల్ ప్లే స్టోర్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఇందులో రిజిస్టర్ అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకొని అందులో ఇంటి అడ్రస్, సెల్ నంబర్‌ను పొందుపరచాలి. రిజిస్టర్ చేసుకున్నాక అందులో ఇచ్చిన నంబర్‌కు వన్ టైం పాస్‌వర్డ్, యూజర్ ఐడీ వస్తుంది. ఎప్పుడైనా ఊరికి వెళ్లినప్పుడు ఈ యాప్‌లోకి వెళ్లి యూజర్ ఐడీని టైప్ చేసి రిక్వెస్ట్ పోలీస్ వాచ్ ద్వారా సమాచారం ఇవ్వాలి. ఫలానా తేదీల్లో ఇంట్లో ఉండటం లేదని సమాచారం టైప్ చేసి సబ్‌మిట్ చెయ్యాలి. సమాచారం అందుకున్న తర్వాత పోలీసులు ఊరికి వెళ్లే ముందు రోజున మీ ఇంటికి వచ్చి వైర్‌లెస్ మోషన్ సీసీ కెమెరాలు, మోడెమ్ మొదలైన పరికరాలు బిగించి వెళ్తారు. అప్పటి నుంచి మీ ఇల్లు పోలీస్ నిఘాలో ఉంటుంది. ఒకవేళ దొంగలు వచ్చి తాళం పగలగొట్టేందుకు ప్రయత్నిస్తే అక్కడున్న కెమెరాలో అలారం మోగుతుంది. ఆ సమాచారం వెంటనే పోలీసులకు అందుతుంది. మీరు లేని సమయంలో ఎవరైనా ఇంటికి వస్తే ఆ వీడియోలు, ఫొటోలు సీసీ కెమెరాల సహాయంతో పోలీస్ కంట్రోల్ రూంకి చేరుతాయి. ఇవన్నీ ఈ యాప్‌తోనే సాధ్యమవుతాయి. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని నగర పోలీసులు కోరుతున్నారు.

నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి..



పండగలకు సొంత గ్రామాలకు వెళ్లే వారు తప్పకుండా తమ సమాచారాన్ని పోలీస్ స్టేషన్‌లో అందజేయండి. లేదా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ఉపయోగించుకోండి. పండగ షాపింగ్ చేసే సమయంలో నగదు, బంగారు వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండండి. అత్యవసరమైనప్పుడు డయల్ 100, 1090కి గాని, టూటౌన్ నంబర్ 0891-2783672కు గానీ, మహారాణిపేట నంబర్ 0891-2746866కు గాని ఫిర్యాదు చేయండి. పండగ సంతోషంగా జరుపుకోండి.

– ఎన్. సునీల్, టూటౌన్ క్రైం ఎస్ఐ

కష్టపడే వారికి వైఎస్సార్‌సీపీలో గుర్తింపు

డాబాగార్డెన్స్: ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తూ, పార్టీ అభివృద్ధికి కృషి చేసే వారికి వైఎస్సార్‌సీపీ అధిష్టానం తగిన గుర్తింపు ఇస్తుందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. స్టేట్ బూత్ వింగ్ సెక్రటరీగా 38వ వార్డు మాజీ ప్రెసిడెంట్ శంకాబత్తుల సన్యాసిరావు నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం వాసుపల్లిని గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గణేష్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాక్షస పాలన చేస్తోందన్నారు. బాలకృష్ణ అసెంబ్లీలో అన్నయ్య చిరంజీవిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై కనీసం పవన్ కల్యాణ్ నోరు మెదపలేకపోయారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని అవమానిసూ మాట్లాడిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకపోతే ప్రజలే బాలకృష్ణకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తారని గుర్తుంచుకోవాలన్నారు.



వాసుపల్లిని గజమాలతో సత్కరిస్తున్న సన్యాసిరావు తదితరులు

తమ నేత వాసుపల్లి ప్రోత్సాహంతో పార్టీ పెద్దలు తనకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తానని సన్యాసిరావు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, చేపల నూకరాజు, సారిపల్లి అరుణ, చిన్ని కృష్ణ, వల్లి శ్రీను, చేపల రాజు, ఆకుల శ్యామ్ పెద్ద ఎత్తున కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మహారాణిపేట: రెండు వేర్వేరు భవనాలకు జీవీఎంసీ అనుమతి పొంది వాటిని కలిపి ఒకే భవనంలా నిర్మించడంతో పాటు అనుమతి లేని మూడో అంతస్తు నిర్మాణంపై దృష్టి సారించాలని శనివారం కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌కు ఫిర్యాదు అందింది. మహారాణిపేటకు చెందిన పలువురు మహిళలు, స్థానికులు కలెక్టర్‌ను కలిసి తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. సెట్ బ్యాక్ వదలకుండా నిర్మాణాలు జరుగుతున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. అనధికార నిర్మాణం వల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారని, జీవీఎంసీ అధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.



అనుమతి లేకుండా జరుగుతున్న మూడో అంతస్తు నిర్మాణం

ఇంద్రాణి జగ్గారావు సేవలు నిరుపమానం

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో అంకితం ఇంద్రాణి జగ్గారావు 91వ జయంతి శనివారం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణకుమారి అధ్యక్షతన జరిగింది. విమెన్ సెల్ అసోసియేషన్ అధ్యక్షురాలు భానుమతి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ అర్చన నేతృత్వం వహించిన ఈ కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ కెరీర్ గైడెన్స్ సెంటర్ విభాగాధిపతి, కెరీర్ సర్వీస్ సీనియర్ డైరెక్టర్ కేవీ ఉమాదేవి పాల్గొని ఇంద్రాణి జగ్గారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇంద్రాని జగ్గారావు సేవలను, అంకిత భావాన్ని, విమెన్ ఎంపవర్‌మెంట్‌కు, సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. ఏయూ ఫిజిక్స్ విభాగాధిపతి శ్రీనివాసరావు ఇంద్రాణి సేవలను కొనియాడారు. కళాశాల కరస్పాండెంట్, వైస్ చైర్మన్ భానోజీరావు మాట్లాడుతూ తన తల్లి అంకితం ఇంద్రాణి జగ్గారావు చిన్న తనం నుంచి క్రమశిక్షణతో తమను పెంచి సమాజానికి ఉపయోగపడే పౌరునిగా తీర్చిదిద్దారని, ఆమెను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల కామర్స్ లెక్చరర్, ఏవీఎన్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, కళాశాల ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజని, పూర్వ విద్యార్థులు షఫీ, మదన్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



ఇంద్రాణి జగ్గారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అదీప్ భానోజీరావు తదితరులు

పలు రూపాల్లో పూజలందుకున్న దుర్గమ్మ



సామూహిక కుంకుమ పూజలో మహిళలు

డాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్‌లో వెలసిన కన్యకాపరమేశ్వరి శనివారం తిరుమల తిరుపతి బాలాజీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన వాసవీ కనకదుర్గాదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు, హోమం నిర్వహించారు. నాట్యదీపిక కూచిపూడి అకాడమీ వ్యవస్థాపకురాలు ఎల్.నరేంద్ర ఇంద్రాణి నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్లు పూసర్ల సురేష్‌కుమార్, సుగ్గు శివ, కంకటాల సతీష్, దేవాలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమ వెంకట బాలాజీ కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



తిరుమల బాలాజీ అలంకరణలో కన్యకాపరమేశ్వరి

లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గాలమ్మ..

వెలంపేటలో వెలసిన దుర్గాదేవి అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

దుర్గాదేవికి సారె సమర్పణ..

జీవీఎంసీ 29వ వార్డు సెంచురీక్లబ్ వంకల వీధి వరసిద్ధి వినాయక, షిర్డీ సాయిబాబా మందిరం వద్ద బమ్మిడి భార్గవ్, నక్కిల్ల రాజేష్ ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద ఎత్తున ఊరేగింపుతో సారె సమర్పించారు. ఆంథోనీనగర్‌లో యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి ఉత్సవాల్లో సంఘ సేవకుడు మన్యాల శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



దుర్గాదేవికి ఊరేగింపుగా సారె తీసుకెళ్తున్న భక్తులు

భువనేశ్వరీదేవిగా దుర్గమ్మ..

అల్లిపురం: యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ శనివారం భక్తులకు భువనేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు విశేషంగా అమ్మవారిని అలంకరించారు. భక్తులచే అమ్మవారికి కుంకుమ పూజలు చేయించారు.



లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో దుర్గాలమ్మ

క్లుప్తంగా

అభాగ్యునికి ఆసరా



మజ్జి చిన్నాకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న పచ్చిరపల్లి రాము, రమేష్

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డుకు చెందిన మజ్జి అప్పలరాజు అలియాస్ చిన్న ఆటో నడపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొద్దిరోజుల క్రితం ఆయనకు చలిజ్వరం రావటంతో ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ వారు నరాలకు ఇంజక్షన్ చేయడంతో కొద్ది సేపటికే కోమాలోకి వెళ్లిపోయాడు. తర్వాత స్ట్రోక్ రావటంతో ఐదు నెలల క్రితం తన కళ్లు రెండు కళ్లు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పచ్చిరపల్లి రాము, వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ శనివారం ఆయనను పరామర్శించారు. ఆయనకు నిత్యావసర సరుకులు అందజేశారు.

నర్సుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో డాక్టర్ వాసవీలత, డాక్టర్ శ్రీహరి

మహారాణిపేట: నర్సుల ఆత్మీయ సమ్మేళనం శనివారం కేజీహెచ్‌లో నిర్వహించారు. 1976–79 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ యు. శ్రీహరి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీలత, నర్సింగ్ సూపరింటెండెంట్ ఓపీఎల్ కుమారి, ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు భవానీ, కార్యదర్శి వరలక్ష్మి, నర్సుల సంఘం నాయకురాళ్లు బూతం భాగ్యలక్ష్మి, డి. లక్ష్మి, సుమిత్ర, పుట్టు రాజీ, కళావతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాల జోలికి పోరాదు



మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ జీడీ బాబు

మహారాణిపేట: యాంటీ ర్యాగింగ్, మత్తు పదార్థాల నివారణపై ఆంధ్రా మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు, వన్‌టౌన్ పోలీసులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జీడీ బాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువులో మంచి భవిష్యత్తు సాధించాలన్నారు. ఎవరూ ర్యాగింగ్‌కు పాల్పడకూడదన్నారు. అలాగే మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు. అనాటమీ విభాగానికి చెందిన కిషోర్, అధ్యాపకులు విద్యార్థులకు మార్గ నిర్దేశం చేశారు.

విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



ఫ్యాషన్ వాక్ చేస్తున్న విద్యార్థినులు

బీచ్‌రోడ్డు: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం వుడా చిల్డ్రన్ ఏరినాలో సదరన్స్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ యాన్యువల్ కల్చరల్ ఫెస్ట్–2025 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వంశీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి విజయతీరాలకు చేరుకోవాలన్నారు. సదరన్ గ్రూప్ ఎదుగుదలలో తన సహచరులు, ప్రభుత్వ ప్రతినిధులు, మీడియా సహకారం ఉందని చైర్మన్ సతీష్ పొన్నం తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ఫ్యాషన్ వాక్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి దిలీప్, డాక్టర్ శిరీష రాణి, డాక్టర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి విశేష సేవలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష సేవలు నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకోవాల్సిందే



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని అడ్డుకోకపోతే, రాష్ట్రంలోని పేద విద్యార్థుల డాక్టర్ చదువు కలగానే మిగిలిపోతుందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు బాజీ నాయుడు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సీనియర్ న్యాయవాది పాకా సత్యనారాయణ తెలిపారు. పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం కూటమి ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడానికి చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాటం చేయాల్సిందేనని, ఎట్టి పరిస్థితిలోను ప్రైవేట్ మెడికల్ కళాశాలల్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, పార్టీ లీగల్ సెల్ నాయకులు పరదేశిరెడ్డి, మొల్లి రామారావు, సూరిశెట్టి అనిల్ కుమార్, నీలకంఠ సంతోష్‌కుమార్, ఆరిపాక రామకృష్ణ, బి.తులసీదాస్, వాగుపల్లి చిన్నారావు, పైడితల్లి, కంటి మహంతి చంద్రమౌళి, పి.రవికుమార్, తుంపాల శ్రీనివాసరావు, గాలి రామిరెడ్డి, సియ్యాద్రి రధి, దాసరి గణేష్, కొల్లి వెంకటకుమార్, మీనా, పద్మ తదితరులు పాల్గొన్నారు.

హోమ్ స్టేతో నెలకు రూ.40 వేల సంపాదన



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, రేణు గుప్తా

మహారాణిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు నగరంలోని హోమ్ స్టే నిర్వాహకురాలు రేణు గుప్తాతో వర్చువల్ విధానంలో ముఖాముఖి నిర్వహించారు. సిరిపురంలో ఆమె నిర్వహిస్తున్న హోమ్ స్టే, దాని ద్వారా లభిస్తున్న ఆదాయం, వ్యాపార కార్యకలాపాల గురించి సీఎం ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి జె.మాధవి, ఇతర అధికారులు కూడా పాలు పంచుకున్నారు. ముఖ్యమంత్రి అడిగిన ప్రశ్నలకు రేణు గుప్తా సమాధానమిస్తూ, ఉత్తర భారతదేశం నుంచి వచ్చిన తాను తన భర్తతో కలిసి విశాఖలోనే స్థిరపడ్డానని తెలిపారు. ఈ హోమ్ స్టే ద్వారా నెలకు సుమారు రూ.40,000 వరకు సంపాదిస్తున్నట్లు వివరించారు.